క్లుప్తంగా

తెన్నేరులో వైఎస్సార్ కంటివెలుగు



కంకిపాడు: కంటి సంరక్షణపై శ్రద్ధ వహించాలని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ అన్నారు. మండలంలోని తెన్నేరు గ్రామంలో బుధవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. 60 ఏళ్లు నిండిన వృద్ధులు 110 మందికి రాజేష్‌కుమార్ కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కంటి ఇబ్బందులను తొలి దశలోనే గుర్తించి వైద్యం చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు అమలు చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుగుణ, జాను, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో అన్నదాతల అవస్థలు



హనుమాన్‌జంక్షన్ రూరల్: కుండపోతగా కురుస్తున్న అకాల వర్షాలతో దాళ్వా వరిసాగు చేసిన రైతులు అసౌకర్యానికి గురయ్యారు. బాపులపాడు మండలం బొమ్ములూరులోని అకాలవర్షాలతో వరి పంట నీట మునిగింది. వరికోతలు కోసి పనలపై ఉన్న పొలాల్లో ధాన్యం మొలకరావటంతో అన్నదాత లబోదిబోమంటున్నాడు. మరి కొన్నిచోట్ల వరికుప్పలను పరదాలతో కప్పినప్పటికీ ఈదురుగాలుల ధాటికి ఎగిరిపోయి ధాన్యం కుప్పలు పూర్తిగా తడిసిపోయాయి. ఎడతెరిపి లేకుండా గత ఐదురోజులుగా కురుస్తున్న వర్షాలు వరిపంటకు తీవ్రనష్టాన్ని కలిగించాయని రైతులు వాపోతున్నారు.

వేణుగోపాలుని కల్యాణ మహోత్సవాలు ప్రారంభం



పెనమలూరు: మండల పరిధిలోని యనమలకుదురు, పోరంకి గ్రామాల్లో ఉన్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారి కల్యాణ మహోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. యనమలకుదురులోని శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయంలో ఈ నెల 6వ తేదీ వరకు లోక కల్యాణార్థం త్రయాహ్నిక దీక్ష కల్యాణ మహోత్సవం చేయనున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం స్వామివారిని పెండ్లి కుమారుడిగా అలంకరించారు. సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 9 గంటలకు సంతానం లేని స్త్రీలకు ధ్వజారోహణ అనంతరం గరుడ ప్రసాదం ఇచ్చారు. 4వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు వెలగపూడి శ్రీనివాసరావు దంపతులు స్వామివారికి తిరుక్కల్యాణం చేస్తారు.

పోరంకిలో..

పోరంకి శ్రీ వసంత వేణుగోపాలస్వామి, శ్రీఆంజనేయ స్వామివార్ల దేవస్థానంలో శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామివారి కల్యాణ మహోత్సవాలు ప్రారంభించారు. దేవస్థానంలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మహోత్సవాలు నిర్వహిస్తారు. మొదటి రోజు స్వామివారిని పెండ్లికుమారుడిని చేశారు. ఆలయంలో గురువారం రాత్రి 7.30 గంటలకు దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు.

తడిసిన పంటల పరిశీలన

రామవరప్పాడు: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో దెబ్బతిన్న పంటలను బుధవారం నున్నలో మండల వ్యవసాయాధికారి బి. రంగనాథ్ పరిశీలించారు. ఆరబెట్టిన ధాన్యాన్ని, జొన్నపంట ఉత్పత్తులను పరిశీలించి నష్ట వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ అకాల వర్షాల ఫలితంగా మండలంలో పలు గ్రామాల్లో పంట ఉత్పత్తికి నష్టం వాటిల్లిందన్నారు. నష్టపోయిన రైతులందరికి పంట నష్టం పరిశీలించి నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు మండలంలో 8000 క్వింటాళ్ల వరి, 4000 క్వింటాళ్ల జొన్న తడిసినట్లు గుర్తించామని తెలిపారు.

సహకార సంఘాల అభివృద్ధికి ప్రాధాన్యం

కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తదితరులు

రామవరప్పాడు: సహకార సంఘాల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధానం ఇస్తున్నారని కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులోని రామవరప్పాడు విశాల సహకార పరపతి సంఘం లిమిటెడ్ నూతన భవన నిర్మాణానికై బుధవారం గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌తో కలిసి తన్నీరు నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోట్లు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 435 సహకార సంఘాలు ఉన్నాయని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయంలో పాలకవర్గం నియమించిన తర్వాత సుమారు 190 సహకార సంఘాలకు రూ.50 కోట్ల రుణాలిచ్చి అభివృద్ధి చేశామన్నారు. కేడీసీసీ బ్యాంకు ఈ ఆర్థిక సంవత్సంలో రూ.43 కోట్ల నికర లాభాలతో అగ్రస్థానంలో ఉన్నట్లు తెలిపారు. గన్నవరం నియోజకవర్గంలో హనుమాన్‌జంక్షన్, ఉంగుటూరులలో స్థలాలు సేకరించి ఎమ్మెల్యే వంశీమోహన్ చేతుల మీదుగా తాజాగా శంకుస్థాపన పూర్తి చేసుకుని నిర్మాణ పనులు కూడా ప్రారంభమైనట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా గంపలగూడెం, కాటూరు, పెనమలూరు, బందరు, అవనిగడ్డ నియోజకవర్గాల్లో నూతన భవనాలు నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ మాట్లాడుతూ గ్రామంలో దాతలు ఇచ్చిన విలువైన స్థలంలో నాబార్డు నుంచి రూ.2 కోట్ల నిధులతో నాలుగు అంతస్తుల భవన నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇందుకు గానూ సీఆర్డీఏ నుంచి అనుమతులు కూడా పొందారని కేడీసీసీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు సహకారంతో మరో 4 నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్లు వివరించారు. ఈ సహకార సంఘం రూ .14 కోట్ల టర్నోవర్‌తో లాభాల బాటలో నడుస్తుందని సొసైటీ బ్యాంకు చైర్మన్ సాదం వెంకటేశ్వరరావును అభినందించారు. గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మాదు శివరామకృష్ణ, కోనేరు సుబ్బారావు, సొసైటీ బ్యాంకు చైర్మన్ సాదం వెంకటేశ్వరరావు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు, గన్నవరం మార్కెట్‌యార్డ్ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్. వెంకటేశ్వరరావు, నిడమానూరు, ఎనికేపాడు, రామవరప్పాడు సర్పంచ్‌లు శీలం రంగారావు, రాచమళ్ల పూర్ణచంద్రరావు, వరి శ్రీదేవి, వ్యవసాయ సలహ సంఘం చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఓంకార్ రెడ్డి, పలు గ్రామాల ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం

డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గీతాబాయి



ముస్తాబాద పీహెచ్‌సీ సందర్శించి రికార్డులు పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గీతాబాయి

గన్నవరం రూరల్: రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డీఎంఅండ్‌హెచ్‌వో జి.గీతాబాయి ఆదేశించారు. మండలంలోని ముస్తాబాద పీహెచ్‌సీని బుధవారం ఆమె సందర్శించారు. ఆస్పత్రిలో రికార్డులు పరిశీలించారు. ఓపి, గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాల రోగులకు అందుతున్న సేవలను సిబ్బందితో సమీక్షించి రోగులతో మాట్లాడారు. పీహెచ్‌సీలో వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండటంతో పాటు మెరుగైన సేవలు అందిస్తున్నారని రోగులు చెప్పారు. దీంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేస్తూ మరిన్ని సేవలందించాలని సూచించారు. ముస్తాబాదలో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని ఆమె పరిశీలించారు. 104 వాహన వైద్య సేవలు, ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలు, గ్రామాల్లో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రాల నిర్వహణ తదితర అంశాలను ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాస్ డీఎంఅండ్‌హెచ్‌వోకు వివరించారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి ప్రభుత్వం తోడ్పాటు



ప్రసంగిస్తున్న ఎంపీపీ అనగాని రవి

గన్నవరం: విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల తోడ్పాటునందిస్తున్నట్లు ఎంపీపీ అనగాని రవి తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సం, ఉద్యోగ విజయోత్సవం బుధవారం ఉత్సాహంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న అనగాని మాట్లాడుతూ మహానేత డాక్టర్ వైఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా లక్షలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించారని చెప్పారు. తండ్రి బాటలోనే తనయుడు సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కూడా విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థుల చదువుల కోసం తల్లిదండ్రులకు ఎటువంటి ఆర్థిక భారం లేకుండా అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. ముఖ్యంగా విద్య బోధన, వసతులు పరంగా ఈ కళాశాల జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించడం ప్రశంసనీయమన్నారు. క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎక్కువ మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించే విధంగా ప్రోత్సాహించిన అధ్యాపక బృందాన్ని ఆయన అభినందించారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ. గౌసాని మాట్లాడుతూ...ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ఈ విద్యా ఏడాది నుంచి కళాశాలలో కంప్యూటర్, ఎల్రక్టానిక్ కోర్సులను అందుబాటులో తీసుకువస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.పద్మావతి తెలిపారు. సాంకేతిక విద్య వల్ల విద్యార్థులు తక్కువ సమయంలోనే ఉద్యోగులుగా స్థిరపడవచ్చని చెప్పారు. సీనియర్ అధ్యాపకులు వీ. ఎలీషా అధ్యక్షతన విజయకృష్ణా అగ్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎండీ. జీ. విజయ్‌కుమార్, సర్పంచి బడుగు బాలమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు రెడ్డి సరోజినీదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఎమ్మెల్యే వంశీ ఆర్థిక సాయం అందజేత



లబ్ధిదారులకు ఆర్థికసాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆపన్నులకు ఆర్థిక సాయం అందించటంలో గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ ఎల్లప్పుడూ ముందు ఉంటారని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లికి చెందిన ఇద్దరికి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అందించిన ఆర్థికసాయాన్ని బుధవారం ఆయన పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన బీఫార్మసీ విద్యార్థిని కడ్రే మానసకు కళాశాల ఫీజుల నిమిత్తం రూ.25 వేలు ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే వంశీ అందించారు. ఇటీవల కల్వకుంట శ్రీనివాసరావుకు చెందిన వరిగడ్డి వాము అగ్నిప్రమాదానికి గురై దగ్ధం కావటంతో ఆయనకు రూ.10 వేలు పంపిణీ చేశారు. ఈ మొత్తాన్ని ఆవిర్నేని శేషగిరిరావుతో పాటుగా జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని చేతుల మీదగా లబ్ధిదారులకు అందించారు. పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి థెరిస్సా, ఎంపీటీసీ సభ్యురాలు దూసరి నిర్మల, వైఎస్సార్ సీపీ నాయకులు గూడవల్లి రత్నసుధాకర్, ఆత్మూరి బాలాజీ, కొడెబోయిన బాబి, కొమరవల్లి కిరణ్‌మూర్తి, చందు శ్రీనివాసరావు, రాయి శివ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

పెనమలూరు: భార్యను వేధిస్తున్న భర్తపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు లంబాడీపేటకు చెందిన ధారావత్ పూజ ఏడాదిన్నర క్రితం లక్ష్మణ్‌నాయక్‌ను వివాహం చేసుకుంది. భర్త క్యాటరింగ్ పని చేస్తుంటాడు. కొంతకాలంగా భర్త దురలవాట్లకు బానిసగా మారి భార్యను అనుమానిస్తూ వేధించ సాగాడు. భర్త వేధింపులు తాళలేక భార్య పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. పోలీసులు భర్తపై కేసు నమోదు చేశారు.

తెంపల్లిలో పారిశుద్ధ్య పనులు

గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లిలో బుధవారం సర్పంచ్ కొలుసు శిరీషా ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు నిర్వహించారు. అకాల వర్షాలకు పలు చోట్ల గ్రామంలో నీరు నిల్వ ఉండటంతో గ్రామస్తులు ఇక్కట్లు పడుతున్నారు. దీంతో సర్పంచ్ వెంటనే చర్యలు తీసుకుని మురుగునీటి సమస్యలను పరిష్కరించారు.

గ్రామస్థాయిలో ప్రత్యేక కమిటీలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రత్యేకంగా గ్రామ కమిటీలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో కె.ప్రభాకరరావు బుధవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల నిర్మాణంతో పేదలకు సొంతిల్లు కల నేరవేరుతుందని చెప్పారు. ఇళ్ల స్థలం మంజూరు చేయటంతో పాటుగా గృహ నిర్మాణానికి ప్రభుత్వం దశల వారీగా నిధులు మంజూరు చేస్తుందని వివరించారు. అంతేకాక ఉచితంగా ఇసుక, రాయితీపై సిమెంట్, ఐరన్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. వీటిపై లబ్ధిదారుల్లో ఎప్పటికప్పుడు అవగాహన కల్పించి, ఇంటి నిర్మాణంపై చైతన్యవంతులను చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రత్యేక గ్రామ కమిటీలను సర్పంచ్ అధ్యక్షతన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్పంచ్‌తో పాటుగా పంచాయతీ కార్యదర్శి, వేల్ఫేర్ అసిస్టెంట్, వీఆర్వో, ఎంఎస్‌కే, వైఎస్సార్ క్రాంతి పథం సీసీ, బుక్ కీపర్, వలంటీర్ ఈ కమిటీలో ఉంటారని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ ఈ కమిటీలను ఏర్పాటు చేసి లబ్ధిదారులను నిరంతరం కలిసి ఇంటి నిర్మాణం చేపట్టే విధంగా ప్రోత్సహించనున్నట్లు చెప్పారు.

గృహ నిర్మాణాలపై ఎంపీడీఓ సమీక్ష



కలవపాములలో సమీక్ష చేస్తున్న ఎంపీడీఓ విమాదేవి, సర్పంచ్ బాలస్వామి

ఉయ్యూరు: జగనన్న లే అవుట్‌లో గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ విమాదేవి సూచించారు. మండలంలోని కలవపాముల గ్రామంలో జగనన్న లే అవుట్‌లో గృహ నిర్మాణాలపై బుధవారం ఆమె సమీక్ష చేశారు. లబ్ధిదారులకు నిర్మాణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులు గృహాలను నిర్మించుకునేందుకు ముందుకు వస్తే ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటు అందిస్తుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకుని గృహప్రవేశాలు చేయాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ పానుగుమాటి బాలస్వామి, హౌసింగ్ ఏఈ బుల్లయ్య, కార్యదర్శి లక్ష్మయ్య పాల్గొన్నారు. అనంతరం మండలంలోని ఆకునూరు గ్రామంలో ఎంపీడీఓ విమాదేవి పర్యటించారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియను పరిశీలించి ఉపాధి పనులను తనిఖీ చేశారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

ఉంగుటూరు: నాడు-నేడు ఫేజ్ 2 పనులు జూన్ మొదటి వారంలోగా పూర్తి చేయాలని సర్వశిక్ష అభియాన్ అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ డి.నగేష్, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ గోపాల్‌రావు సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో నాడు-నేడు ఫేజ్ 2, జగనన్నవిద్యా కానుక పథకాలపై పాఠశాలల హెచ్‌ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు నేడు పనులు ప్రణాళికాబద్ధంగా త్వరితగతిన పూర్తి చేసేందుకు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అలాగే పాఠశాలలు ప్రారంభానికి ముందే జగనన్న విద్యా కానుక విద్యార్థులందరికీ అందజేయాలని చెప్పారు. ఇప్పటి వరకు జరిగిన పనులు, చేయాల్సిన పనులపై సమీక్షించారు. ఎంపీడీవో శేషగిరిరావు, ఎస్ఎస్ఏ ఏఈ గంగరాజు, హెచ్‌ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాస్తారోకో

గన్నవరం: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ, రైతు సంఘం, కౌలు రైతు సంఘాల నేతలు జాతీయ రహదారిపై బైఠాయించి విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు. జాతీయ రహదారిపై వాహనాల అంతరాయం ఏర్పాడడంతో పోలీసులు రంగంలోకి దిగి రాస్తారోకోను అడ్డుకున్నారు. అనంతరం కౌలురైతు సంఘం రాష్ట్ర నాయకులు టీవీ లక్ష్మణస్వామి మాట్లాడుతూ...ఆంధ్రులు అనేక త్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరించేందుకు ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణను విరమించుకోవాలని, లేకపోతే ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రజా సంఘాల నేతలు వీరాస్వామి, మల్లంపల్లి ఆంజనేయులు, ఆజ్మీర వెంకటేశ్వరరావు, బడుగు మరియదాసు, గుండిమెడ ఉదయ్, సర్ధార్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కృష్ణా జిల్లా వ్యవసాయాధికారి విజయభారతి



గొడవర్రులో తడిచిన ధాన్యం పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయభారతి, ఇతర అధికారులు

కంకిపాడు(పెనమలూరు): వర్షాలతో పంట నష్టం ఏర్పడిన ప్రాంతాల్లో రైతాంగం సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయభారతి సూచించారు. మండలంలోని గొడవర్రు, మద్దూరు ప్రాంతాల్లో బుధవారం వ్యవసాయాధికారులు పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో తడిచిన ధాన్యం బస్తాలు, మొక్కజొన్న, జొన్న రాశులను పరిశీలించారు. పంట నష్టం, పెట్టుబడి వివరాలను రైతుల నుంచి తెలుసుకున్నారు. అకాల వర్షంతో రైతుల ఇబ్బందులను వ్యాపారులు సొమ్ము చేసుకునే యత్నం చేస్తున్నారని, కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తెస్తే రైతులకు ఉపయుక్తంగా ఉంటుందని గొడవర్రు సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్ అధికారులకు వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి విజయభారతి మాట్లాడుతూ గ్రామస్థాయిలో 33 శాతం కంటే ఎక్కువగా ఏర్పడిన పంట నష్టాన్ని వీఏఏలు, వీహెచ్‌ఏలు, ఇతర శాఖల సమన్వయంతో అంచనాలను సమర్థంగా రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఇప్పటికే ప్రాథమిక అంచనాలను సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అవసరమైతే కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తెస్తామన్నారు. రైతులు ధాన్యం రాశులపై ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలన్నారు. కాటాలు వేసి త్వరితగతిన మిల్లులకు తరలించుకోవాలన్నారు. పొలాల్లో ఉన్న మొక్కజొన్న, జొన్న పంటలను వాతావరణం తెరిపివ్వగానే కోత కోయించి మార్కెట్‌కు తరలించుకోవాలన్నారు. పొలాల్లో నిలిచిన నీటిని బోదెల్లోకి మళ్లించి పంట నాణ్యత దెబ్బతినకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ డీడీ ఎస్‌వైవీఎస్ మనోహరరావు, ఏడీ స్వర్ణలత, ఏఓ పీఎం కిరణ్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చోడవరం లబ్ధిదారుల గృహాల నిర్మాణం ప్రారంభం

పెనమలూరు: చోడవరం గ్రామంలోని లబ్ధిదారులకు వణుకూరులో కేటాయించిన ఇళ్ల స్థలాల్లో బుధవారం గృహాల నిర్మాణానికి గ్రామ సర్పంచి కాకర్ల వెంకటరత్నం శంకుస్థాపన చేశారు. చోడవరంలో మొత్తం 199 మందికి ఇళ్ల స్థలాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇందులో మొదటి దశలో భాగంగా 156 మందికి ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. ప్రస్తుతం 79 మంది లబ్ధిదారులు ముందుకు వచ్చి ఇళ్ల నిర్మాణానికి సిద్ధపడ్డారని తెలిపారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన టి.నాగకల్యాణి, కె.చంద్రకళ అనే లబ్ధిదారులు బుధవారం గృహాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారని చెప్పారు. గ్రామంలో మిగతా లబ్ధిదారులు కూడా ముందుకు వచ్చి గృహాలు నిర్మాణం చేసుకోవాలని సూచించారు.

అకాల వర్షంతో అపార నష్టం

- పంటను కాపాడుకునే యత్నంలో రైతులు
- వర్షాలు తగ్గిన తరువాత ఎన్యూమరేషన్



తాడిగడపలో దెబ్బతిన్న పంట



పెనమలూరులో దెబ్బతిన్న మొక్కజొన్న

పెనమలూరు: అకాల వర్షాలు రైతులకు శాపంగా మారాయి. మండల పరిధిలో గత నాలుగు రోజులుగా వరుసగా వర్షాలు కురవటంతో పలు గ్రామాల్లో మొక్కజొన్న, జొన్న, పసుపు, వరి, అరటి పంటలకు నష్టం వాటిల్లింది. ప్రధానంగా మొక్కజొన్న పంట పొలాల్లో రాసులుగా పోసిన సమయంలో వర్షాలు కురిశాయి. దీంతో మొక్కజొన్న, జొన్నపంటలు వర్షానికి తడిశాయి. అరటి పంట, పసుపు రాసులు కూడా వర్షానికి తడిశాయి. అరటి తోటలు చాలా ప్రాంతాల్లో పడిపోయాయి. ఆయా సచివాలయాల పరిధిలో పంట నష్టం వివరాలు సిబ్బంది సేకరిస్తున్నారు.అయితే వర్షం హఠాత్తుగా కురుస్తుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

తడిచిన పంట ఎండబెట్టాలి

పంట పొలాల్లో వర్షానికి తడిచిన జొన్న, మొక్కజొన్న కంకులు, పసుపు కొమ్ములు ఎండబెట్టుకోవాలని రైతులకు ఏవో శైలజ సూచించారు. పంట పొలంలో కోయని పంట, నీటిలో మునిగిన వరి వర్షాలు తగ్గిన తరువాత వివరాలు నమోదు చేస్తామన్నారు. రైతులు ఆందోళనకు గురి కాకుండా తడిచిన పంటను ఎండబెట్టి కాపాడుకోవాలని ఆమె తెలిపారు.

సామాజిక సేవకుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న రక్ష ఫౌండేషన్ ప్రతినిధులు

ఉయ్యూరు: సామాజిక సేవే రక్ష ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ ప్రతినిధి వీరంకి కోటయ్య అన్నారు. పట్టణంలోని సామాజిక సేవకుడు, బీసీ నాయకుడు వీరంకి శివాజీకి రక్ష ఫౌండేషన్ నుంచి రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని బుధవారం అందించారు. ఫౌండేషన్ ప్రతినిధి కోటయ్య మాట్లాడుతూ రక్ష ఫౌండేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పెనమలూరు నియోజకవర్గ మాజీ సమన్వయకర్త పడమట సురేష్ బాబు ఆదేశాలతో శివాజీ కుటుంబానికి ఆర్థిక సాయం అందించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తిగా రక్ష ఫౌండేషన్ సమాజ అభ్యున్నతికి పాటుపడుతుందని చెప్పారు.

రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు



మద్దూరులో వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు

కంకిపాడు: వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు అన్నారు. అకాల వర్షాలతో పంట నష్టం వాటిల్లిన ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు బుధవారం పర్యటించారు. మద్దూరు, కాసరనేనివారిపాలెం, ప్రొద్దుటూరు, దావులూరు, చలివేంద్రపాలెం గ్రామాల్లో పర్యటించి పంట నష్టం వివరాలను తెలుసుకున్నారు. మొక్కజొన్న, జొన్న, ధాన్యం, పసుపు పంటలకు అపారంగా నష్టం వాటిల్లిందని, పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోయారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు మాట్లాడుతూ అకాల వర్షంతో రైతులు నష్టపోయారన్నారు. సమస్య తీవ్రతను ఎమ్మెల్యే పార్థసారథి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకునేలా చర్యలు చేపడతామన్నారు. ఆందోళన చెందొద్దని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, సర్పంచ్‌లు చిప్పల రామదాసు, పి.వరప్రసాద్, ఎంపీటీసీ ఒడుగు శ్రీనివాసరావు, నాయకులు పి.నాగార్జున, వడుగు వెంకట్రావ్, వడుగు ఆంజనేయులు, బీహెచ్ రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.